మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద మరమ్మతులు

నమస్తే కథనానికి స్పందన

మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కన్నెపల్లి, మే 17 : భీమిని మండలం వీగాం గ్రామంలో 'వృథాగా మిషన్ భగీరథ నీరు' అని 'నమస్తే'లో శుక్రవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. సంబంధిత అధికారులు నీటి ట్యాంకున్ పరిశీలించారు. ట్యాంక్ కింద ఏర్పడిన బుంగను పూడ్చివేసి, మరమ్మతులు చేశారు.

కేవీకేలో వర్క్‌షాప్

బెల్లంపల్లి రూరల్, మే 17 : బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ అధికారులు, విత్తన కంపెనీ ప్రతినిధులతో వానాకాలంలో అధిక సాంద్రత పద్ధతి సాగు నిర్వహణపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లాలో గతేడాది 157.7 ఎకరాల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేపట్టినట్లు తెలిపారు. రానున్న వానాకాలంలో 400 ఎకరాల్లో అధిక సాంద్రత, క్లోజర్ స్పేసింగ్ పద్ధతిలో సాగుకు జిల్లాను ఎంపిక చేసినట్లు చెప్పారు. నేల రకాలు, విత్తన మోతాదు, విత్తే దూరం, అందుబాటులో ఉన్న రకాలు, పెరుగుదలను నియంత్రించే ఉత్ప్రేరకాల వాడకం, పోషకాల యాజమాన్యం, కలుపు, చీడపీడల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిణి సురేఖ, భీమిని సహ వ్యవసాయ సంచాలకుడు ఇంతియాజ్, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, వేద సీడ్స్ కంపెనీ ప్రతినిధి నరేంద్ర, రాశి సీడ్స్, మహికో, అంకుర్ కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

కోటపల్లి, మే 17 : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ సూచించారు. కోటపల్లి మండలకేంద్రంలో పీఏసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. వర్షాలు పడుతున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేంద్రనాథ్, డిప్యూటీ తహసీల్దార్ నవీన్, పీఏసీఎస్ సీఈవో రాజు నాయక్, పెర్క లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణయ్ కుమార్‌కు జాతీయ అవార్డు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మే 17 : బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రదానం చేయనున్న మహాత్మా జ్యోతి బాపూలే జాతీయ అవార్డుకు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కుమార్ ఎంపికైనట్లు ఆ అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ తెలిపారు. హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో శుక్రవారం ప్రణయ్ పత్రాన్ని అందుకున్నారని పేర్కొన్నారు. పూలే ఆలోచనా విధానంతో విద్యారంగ, నిరుద్యోగ సమస్యలపై ప్రణయ్ పోరాడుతున్నారని, సామాజిక సేవా కార్యక్రమాల్లో తన దైన శైలిలో గుర్తింపు పొందారని వెల్లడించారు. జూన్ 10న పుణెలో బహుజన సాహిత్య అకాడమీ నిర్వహించే వెస్ట్రన్ ఇండియా బహుజన రైటర్స్ 4వ కాన్ఫరెన్స్‌లో అవార్డు అందజేయనున్నట్లు వెల్లడించారు.

ప్రాణహిత స్టేడియం అభివృద్ధి

సీసీసీ నస్పూర్, మే 17 : సింగరేణి ఆధ్వర్యంలో సీసీసీ నస్పూర్ నాగార్జునకాలనీలోని సింగరేణి ప్రాణహిత స్టేడియాన్ని అధునాతన హంగులతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి వెల్లడించారు. వివిధ డిపార్ట్‌మెంట్ల అధికారులతో కలిసి శుక్రవారం స్టేడియాన్ని సందర్శించారు. వర్క్‌షాప్ డీజీఎం రవీందర్, సివిల్ డీజీఎం ఆనందకుమార్, ఇన్‌చార్జి డీజీఎం పర్సనల్ రాజేశ్వర్, వర్క్‌షాప్ ఇంజినీర్ సతీశ్ చక్రవర్తి, సివిల్ ఈఈ సత్యనారాయణ, సీనియర్ పీవో కాంతారావు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కో-ఆర్డినేటర్ తోట సురేశ్ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

మందమర్రి రూరల్, మే 17 : మండలంలోని 11 పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో రాజేశ్వర్ ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైన మండలంలోని చిర్రాకుంట, శంకర్‌పల్లిల్లోని స్కూళ్లను శుక్రవారం పరిశీలించారు. అనంతరం సారంగపల్లి, బొక్కలగుట్టలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వీవో అధ్యక్షురాలు విజయ, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ తిరుమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మందమర్రి/కాసిపేట, మే 17 : మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 గనిలో విధులు నిర్వహిస్తూ పట్టణానికి చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్ మృతిచెందగా, బాధిత కుటుంబానికి శుక్రవారం తోటి కార్మికులు ఆర్థికసాయం అందించారు. రూ.1,10,100 విరాళంగా జమచేయగా, పట్టణంలోని సీఐఎస్ఎఫ్ కాలనీలోని రమేశ్ ఇంటికి వెళ్లి, అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి సుభాష్ చంద్రబోస్, మైనింగ్ సర్దార్ కేతన్ వినోద్, టీబీజీకేఎస్ నాయకుడు సారంగపాణి, సీఐటీయూ పిట్ కార్యదర్శి సురేశ్, ఐఎన్టీయూసీ నాయకులు కారుకూరి తిరుపతి, రాజకొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మే 17 : మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం తరపున అందించే ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25కుగాను అందించే రాష్ట్రీయ బాల పురస్కార్‌కు 6 నుంచి 18 ఏండ్లలోపు బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు జూలై 31వ తేదీలోగా http://awards. gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94914 60658 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

రక్తపోటుపై అవగాహన

సీసీసీ నస్పూర్, మే 17 : ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా నస్పూర్ పీహెచ్‌సీలో శుక్రవారం రక్తపోటుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆహారపు అలవాట్లలో వస్తున్న మార్పుల వల్ల అధిక రక్తపోటుతో పాటు ఇతరాత్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని మంచిర్యాల జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత వివరించారు. 15 రోజుల పాటు పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉప కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అనంతరం దవాఖానలో చేస్తున్న పరీక్షలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నీరజ, శివప్రతాప్, కిరణ్, సమత, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే సింగరేణి ఆధ్వర్యంలో నస్పూర్ డిస్పెన్సరీలో డీవైసీఎంవో రమేశ్ బాబు ఆధ్వర్యంలో అంతర్జాతీయ రక్తపోటు దినోత్సవాన్ని నిర్వహించారు. శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా వర్క్‌షాప్ డీజీఎం రవీందర్, సివిల్ డీజీఎం ఆనంద్‌కుమార్, డాక్టర్ మురళీధర్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హనుమాన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్ సందర్శన

కాగజ్‌నగర్, మే 17 : కాగజ్‌నగర్ మండలంలోని బురదగూడ ప్రాథమిక పాఠశాలలో రీడ్ టూ రూమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్‌ను శుక్రవారం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పద్మశ్రీ, ప్రధానోపాధ్యాయుడు ఎనగంటి భిక్షపతి సందర్శించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

మంచిర్యాల ఏసీసీ, మే 17 : మంచిర్యాల పట్టణానికి చెందిన మేడి నర్సయ్య, మేడి శ్రీనివాస్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. కార్మల్ పాఠశాల సమీపంలో సర్వే నంబర్ 283లో గల 2 ఎకరాల 20 గుంటల భూమిలో అక్రమంగా చొరబడి, యజమాని కంపెల్లి అంజయ్యను కులం పేరుతో దూషించిన కారణంగా వారిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

కెరమెరి : గోయగాం జడ్పీ పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కెరమెరి, మే 17 : పాఠశాల మరమ్మతు పనుల్లో నాణ్యత పాటించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. మండలంలోని గోయగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా ఐకేపీ స్వయం సహాయక సంఘాల మహిళలు చేపడుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. నాణ్యత లోపించకుండా పకడ్బందీగా పనులు చేయించాలని సూచించారు. సమస్యలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభించేలోగా పనులు పూర్తి చేయాలని మహిళా సంఘాలు, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి పనులు, మరుగుదొడ్ల బిల్లులు రాలేదని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు కోరారు. ఆయన వెంట డీఈవో అశోక్, డీపీవో భిక్షపతి గౌడ్, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, ఎంపీడీవో కృష్ణారావు, ఏఈ నజీమొద్దీన్, జీపీ ప్రత్యేక అధికారి ఆడే ప్రకాశ్, ఎంపీవో మహ్మద్ అష్జద్ తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల పరిశీలన..

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మే 17 : జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల పాఠశాలలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఏకరూప దుస్తుల బట్టను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు జూన్ 12 లోగా దుస్తులను అందించాలన్నారు. డీఈవోను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తంగా 48,248 మందికి దుస్తులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అందుకు 1,96,031 మీటర్ల బట్టను కత్తిరించి, శనివారంలోగా అన్ని మండలాలకు చేరేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఆయన వెంట అదనపు ఇన్‌చార్జి డైరెక్టర్ రామకృష్ణ, సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్ కటకం మధూకర్ పాల్గొన్నారు.

'అడ' నర్సరీ తనిఖీ..

అడ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిసున్న నర్సరీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేసవి దృష్ట్యా నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులున్నారు.

చర్యలు తీసుకోవాలి

దహెగాం, మే17 : ఒడ్డుగూడలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ సహకార సంఘం జిల్లా కార్యదర్శి ముంజం ఆనంద్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. తూకంలో రైతులను మోసం చేసిన వ్యవసాయ సహకార సంఘం అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి కలెక్టరేట్ ముట్టడిస్తామన్నారు. ఆయన వెంట ఆదివాసి జిల్లా కార్యదర్శి నెర్పల్లి అశోక్, ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్, మండల కార్యదర్శి నల్లి దామోదర్, రైతులు ఉన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్లపై ఉక్కుపాదం

బెల్లంపల్లి తహసీల్ కార్యాలయం

- బెల్లంపల్లి డివిజన్‌లో డిప్యూటేషన్‌పై బదిలీ
- ఆదేశాలు జారీ చేసిన ఆర్డీవో హరికృష్ణ

నమస్తే ఎఫెక్ట్

బెల్లంపల్లి, మే 17 : బెల్లంపల్లి డివిజన్ ఆరు మండలాల్లోని తహసీల్ కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న మీ సేవ కంప్యూటర్ ఆపరేటర్లను డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. ఈ మేరకు ఆర్డీవో హరికృష్ణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 'డబ్బులిస్తేనే సర్టిఫికెట్' అని ఈ నెల 6న 'నమస్తే'లో వచ్చిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉన్న అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లపై ఉక్కుపాదం మోపారు. అవినీతికి పాల్పడడంతోనే ఆరుగురిని డిప్యూటేషన్‌పై బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. బెల్లంపల్లి తహసీల్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ సాయికుమార్‌ను కన్నెపల్లికి.., తాండూర్ ఆపరేటర్ డీ మహేశ్ నెన్నెలకు.., కాసిపేట ఆపరేటర్ చందు భీమినికి.., భీమిని ఆపరేటర్ పీ ప్రవీణ్ బెల్లంపల్లికి.., కన్నెపల్లి ఆపరేటర్ ఏ అనిల్ కాసిపేటకు.., నెన్నెల ఆపరేటర్ జంపయ్య తాండూర్‌కు బదిలీ చేశారు. దీంతో ఆయా మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బదిలీపై వచ్చిన కంప్యూటర్ ఆపరేటర్లపై తహసీల్దార్ స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కోరుతున్నారు.

ఎలుగుబంటి హతం

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

పెంచికల్ పేట్, మే 17 : రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఎలుగుబంటి మృతి చెందిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అగరగూడ సమీప అటవీ ప్రాంతంలో బుధవారం అటుగా వెళ్తున్న గ్రామస్తులు ఎలుగుబంటి కళేబరాన్ని గమనించి తమకు సమాచారం అందించారని ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్ తెలిపారు. అక్కడికి వెళ్లి విచారణ చేపట్టాని పేర్కొన్నారు. ఎలుగుబంటి తల, వీపుపై గాయాలు ఉన్నట్లుగా గుర్తించారు. ఎవరైనా ఉచ్చులు బిగించి హతమార్చారా.., ఆత్మ రక్షణలో భాగంగా చంపేశారా అనే కోణంలో విచారణ చేపట్టారు. పశువైద్యులతో పంచనామా అనంతరం ఎలుగుబంటి కళేబరాన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు. ఎలుగుబంటికి సుమారు ఆరేండ్లు ఉంటుందని పేర్కొన్నారు. ఎలుగుబంటి చనిపోయి మూడు రోజులు గడుస్తున్నా అటవీ శాఖ అధికారులు సమాచారం బయటకి పోకుండా జాగ్రత్తలు తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ రేంజ్ పరిధిలో అటవీ సంపద పెరగడం, ప్రాణహిత, పెద్దవాగు అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉండడం, నీరు సమృద్ధిగా దొరుకుతుండడంతో వన్యప్రాణుల సంతతి దినదినంగా అభివృద్ధి చెందుతున్నది. కానీ, వాటి సంరక్షణ విషయంలో అటవీ అధికారులు విఫలమవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

గిరిజనుల గుడిసెల తొలగింపు

గుడిసెలను తొలగించిన అధికారులు

జన్నారం, మే 17 : తపాలాపూర్ గ్రామ సమీపంలో కొలాంగూడ గిరిజనులు వేసుకున్న గుడిసెలను తాళ్లపేట రేంజ్ అధికారి సుష్మారావుతో పాటు సిబ్బంది శుక్రవారం తొలగించారు. వాటితో పాటుగా అక్కడ గిరిజనులు ఏర్పాటు చేసిన భీమన్న, పోచమ్మ ఆలయాలను కూడా కూల్చివేశారు. విద్యుత్ స్తంభాన్ని జేసీబీతో పడగొట్టడంతో పాటు, విద్యుత్ తీగలు, ఫ్యాన్లు, గుడిసెలకు ఉపయోగించిన కర్రలు, నిత్యావసర వస్తువులను రేంజ్ కార్యాలయానికి తరలించారు. గూడెం కుల పెద్ద అత్రం రాజును అరెస్టు చేసినట్లు గిరిజనులు తెలిపారు. 15 ఏండ్లుగా ఇక్కడ ఉంటున్న తమ గుడిసులను తొలగించడం అన్యాయమని గూడెంవాసులు ఆరోపించారు. ఈ విషయమై రేంజ్ ఆఫీసర్ సుష్మారావును వివరణ కోరగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుడిసెలను తొలగించినట్లు లిపారు. అక్కడ ఎలాంటి ఆలయాలు లేవని, ఇకముందు ఎవరైన అక్రమంగా అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుటామని వివరించారు.

అబ్బురపరిచిన ఇంద్రధనస్సు..

సిర్పూర్(టీ), మే 17 : సిర్పూర్(టీ) మండల కేంద్రంలో శుక్రవారం సాయంతో ఇంద్రధనస్సు అబ్బురపరచింది. ఒకవైపు వర్షం కురుస్తూ.., మరోవైపు సూర్య కిరణాల నడుమ కనుల విందుగా కనిపించింది. యువకులు, మండల ప్రజలు చూసేందుకు ఉత్సాహన్ని కనబరిచారు.

కాసిపేట : సోమగూడెంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మహిళా సంఘాలకే బాధ్యతలు

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

కాసిపేట, మే 17 : మహిళా సాధికారతే లక్ష్యంగా స్వయం సహాయక సంఘాలకే బాధ్యతతో కూడిన పనులు అప్పగించినట్లు మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బెల్లంపల్లి మండలం సోమగూడెంలో శుక్రవారం మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రాన్ని ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులకు మూడు ప్రధామైన బాధ్యతలు (ఆదర్శ పాఠశాలల పనులు, విద్యార్థుల యూనిఫాంలు కుట్టడం, ప్యాడీ సెంటర్ల నిర్వహణ) అప్పగించినట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు కుట్టే పనులు కూడా ఇచ్చినట్లు చెప్పారు. నాణ్యతతో కుట్టివ్వాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ రాహుల్, డీఈవో యాదయ్య మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభనాటికి విద్యార్థులకు నాణ్యతతో కూడిన దుస్తులు అందించాలని సూచించారు. అనంతరం స్థానిక గ్రామస్తులు గ్రామ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో కిషన్, ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో మహేందర్, అదనపు పీడీ వెంకటేశ్వర్లు, ఎంఈవో మహేశ్వర్ రెడ్డి, డీపీఎం వేణుగోపాల్, ఏపీఎం శ్యామల, కార్యదర్శి రాజలింగు, మాజీ సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలాగౌడ్, ఎంపీటీసీ చుంచు మల్లమ్మ, సీసీ రామకృష్ణ, ప్రసాద్, అంజలి, సుందరేశ్, సీఏ పేరాల మహేశ్, సృజన, కుమార్, రేణుక, పోశన్న, ఏఈ వినయ్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన..

నెన్నెల, మే 17 : మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కేంద్రానికి వచ్చిన ప్రతి గింజా తీసుకోవాలని సూచించారు. తూకాల పేరిట రైతులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

ధాన్యం పరిశీలన..

బెల్లంపల్లి రూరల్, మే 17 : మండలంలోని చంద్రవెల్లి, చాకేపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన ధాన్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. గురువారం రాత్రి జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షానికి ధాన్యం తడిసి, కేంద్రాల్లో ఉన్నట్లు తెలుసుకున్న ఆయన, ధాన్యాన్ని పరిశీలించి, రైతులకు భరోసా ఇచ్చారు. కొనుగోళ్లను త్వరితగతిన చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు దామోదర్‌గౌడ్, జాడిస్వామి, గజెల్లి రాజ్‌కుమార్, రైతులున్నారు.

మందమర్రి రూరల్, మే 17 : సారంగపల్లి మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి కలెక్టర్ సందర్శించారు. కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పలు సూచనలు చేశారు.

గొల్లపల్లికి కదిలొచ్చిన జిల్లా అధికారులు

నమస్తే ఎఫెక్ట్

గొల్లపల్లిలో ధాన్యం తేమ శాతం పరిశీలిస్తున్న డీఎం గోపాల్

నెన్నెల, మే 17 : నెన్నెల మం డలం గొల్లపల్లిలో ధాన్యం ఎవ రూ కొనడం లేదని, పండించిన పంటంతా వర్షాలకు తడుస్తున్నద ని, రాత్రింబవళ్లు వడ్ల కుప్పల వ ద్ద కాపలా ఉంటున్న రైతుల దీన స్థితిపై 'వడ్లు కొంటరా.. కొనరా..' అని 'నమస్తే'లో వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మంచిర్యాల కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సివిల్ సప్లయ్ డీఎం గోపాల్ గొల్లపల్లికి వచ్చి రైతుల ఇబ్బందులను గుర్తించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కావాలనే కొందరు రాజకీయం చేశారని, దానికి బలైపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి గింజా కొంటామని డీఎం గోపాల్ రైతులకు హామీ ఇచ్చారు. పక్కనే ఉన్న మైలారం డీసీఎంఎస్ ద్వారా ప్రస్తుతం ఇక్కడే కొనుగోళ్లు చేయిస్తామని చెప్పారు. వచ్చే వానకాలం సీజన్‌లో తప్పకుండా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

వీసీలో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అధికారులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మే 17 : రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనుల నిర్వహణలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, విద్య, పౌరసరఫరాల శాఖ అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పనుల నిర్వహణ, ధరణిలో పెండింగ్, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రైస్ మిల్లులకు ధాన్యం తరలింపు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ధరణి, ప్రజావాణి కార్యక్రమాల్లో అందిన దరఖాస్తులపై క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించే దిశగా దృష్టిపెట్టాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసిన రైస్ మిల్లులకు సామర్థ్యానికి అనుగుణంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని 685 ప్రభుత్వ పాఠశాలలోల పనులు చేపట్టినట్టుల వెల్లడించారు. 37 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కొనుగోళ్లు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, కాగజ్‌నగర్ రాజస్వ మండల అధికారి కాసబోయిన సురేశ్, జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, సహకార శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణం కూల్చివేత

నిర్మాణాన్ని కూల్చివేస్తున్న జేసీబీ

సీసీసీ నస్పూర్, మే 17 : నస్పూర్ మున్సిపాలిటీలో సర్వే నంబర్ 42లో గల ప్రభుత్వ అసైన్డ్ భూమిలో దిలీప్ ఇల్లు నిర్మిస్తుండగా, శుక్రవారం అధికారులు కూల్చివేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దిలీప్ అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో ఇంటి నిర్మాణం చేస్తుండడంతో గతంలోనే మున్సిపల్ అధికారులు పిల్లర్ల పనులను నిలిపేసి, కూల్చివేశారు. మళ్లీ పనులు మొదలు పెట్టాడు. విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ టీం సభ్యుల (నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్) ఆధ్వర్యంలో శుక్రవారం జేసీబీతో పిల్లర్లను కూల్చివేశారు. అక్కడే ఉంటున్న కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త శ్రీపతి మల్లేశ్ అధికారులను నిలదీశారు. దిలీప్ కుటుంబ సభ్యులతో కలిసి తహసీల్దార్ కారును అడ్డగించి, గొడవ చేశారు. విషయం తెలుసుకున్న సీసీసీ నస్పూర్ ఎస్ఐ-2 జితేందర్ సింగ్ అక్కడికి చేరుకొని, గొడవను సద్దుమనిగించారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు.

చుక్కల దుప్పి మృతి

సిర్పూర్(టీ), మే 17 : సిర్పూర్(టీ)-కాగజ్‌నగర్ ప్రధాన రహదారి పెద్దబండ సమీపంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీ కొని చుక్కల దుప్పి మృతి చెందినట్లు సిర్పూర్(టీ) అటవీ శాఖ రేంజ్ అధికారి పూర్ణచందర్ రావు తెలిపారు. ఆ దుప్పిని రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. విచారణ చేపట్టినట్లు తెలిపారు.

ఒకరి రిమాండ్

జన్నారం, మే 17 : తాళ్లపేట రేంజ్ తపాలాపూర్ బీట్ కంపార్ట్‌మెంట్ 342లో టేకు చెట్లను నరికి అక్కడ గుడిసెలు వేసుకున్న ఆత్రం చిన్న రాజంను అరెస్టు చేసి, గురువారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎఫ్ఆర్వో సుష్మారావు తెలిపారు. లక్సెట్టిపేట కోర్టు జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సీసీసీ నస్పూర్, మే 17 : నస్పూర్‌లోని షిర్కె చౌరస్తాలో శుక్రవారం సైబర్ నేరాలపై సీసీసీ నస్పూర్ ఎస్ఐ-2 జితేందర్ సింగ్ ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ కేసుల విషయంలో పోలీస్ శాఖ 1930 టోల్‌ఫ్రీ నంబర్ తీసుకువచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సత్తయ్య, హెడ్‌కానిస్టేబుల్ రవి, కానిస్టేబుల్ చంద్రమౌళి పాల్గొన్నారు.

థియేటర్ల మూసివేత

మంచిర్యాలటౌన్, మే 17: మంచిర్యాల పట్టణంలోని రెండు సినిమా థియేటర్లను పదిరోజుల పాటు మూసివేశారు. కొత్తసినిమాలు ఆశించిన సంఖ్యలో రాకపోవడం, వేసవి, ఇతరత్రా కారణాల వల్ల ప్రేక్షకులు రాకపోవడం వంటి అంశాలతో నిర్వహణ భారం అధికమవుతున్నదన్న భావనతో రాష్ట్ర వ్యాప్తంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లలో పదిరోజుల పాటు సినిమాల ప్రదర్శన నిలిపివేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మంచిర్యాలలోని ఏషియన్ శ్రీనివాస, లక్ష్మీ టాకీసులను శుక్రవారం నుంచి మూసివేశారు. కాగా, వెంకటేశ్వర థియేటర్‌లో యథావిధిగా సినిమా ప్రదర్శనలు సాగాయి.

ఆరు దుకాణాల్లో చోరీ

లక్సెట్టిపేట, మే 17 : లక్సెట్టిపేట పట్టణంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగ ఆరు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డాడు. దుకాణాల వెనక నుంచి తలుపులు పగలగొట్టి, మొత్తంగా రూ.30 వేలు దోచుకెళ్లినట్లు వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. దొంతగతనం సీసీ పుటేజీల్లో రికార్డవడంతో గాలిస్తున్నట్లు చెప్పారు.

రాయితీపై విత్తనాలు

లక్సెట్టిపేట, మే 17 : లక్సెట్టిపేట వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు రాయితీపై జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. 30 కిలోల బ్యాగ్ రూ.1,116 ఉంటుందని, రెండున్నర ఎకరాలకు ఒక బ్యాగ్ చొప్పున రైతులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

దండేపల్లి, మే 17 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం-నెల్కివెంకటాపూర్, ఆగ్రోస్-దండేపల్లి, గూడెం సొసైటీలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి అంజిత్‌కుమార్ తెలిపారు. పట్టాపాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో సంబంధిత ఏఈవోలకు సంప్రదించి టోకెన్ పొందాలని సూచించారు.

ఎస్టీపీపీలో ఇంజినీర్ ఆత్మహత్య

జైపూర్, మే 17: జైపూర్‌లోని ఎస్టీపీపీలోని ఓ క్వార్టర్‌లో శుక్రవారం మధ్యాహ్నం కిరిటీ (41) అనే ఇంజినీర్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తోటి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనిలో కుటుంబంతో కలిసి నివాసముండే కిరిటీ ఎస్టీపీపీ ఓఅండ్ఎం (విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి) డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ సెక్షన్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. గోదావరిఖని నుంచి రోజూ విధులకు వచ్చి వెళ్తుంటాడు. ఎస్టీపీపీలో తనకు కేటాయించిన క్వార్టర్‌లో భోజనవిరామ సమయంలో రెస్ట్ తీసుకుంటుంటాడు. ఎప్పటిలాగే శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేశాడు. ఆపై ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలంలో కిరిటీ రాసి సూసైడ్ నోట్ పోలీసులకు దొరికనట్లుగా సమాచారం. కిరిటీ భార్య శృతి తన రెండేండ్ల బాబుతో కలిసి వేసవి సెలవుల కోసం ఇటీవలే పుట్టింటికి వెళ్లింది. కొంత కాలంగా ఎస్టీపీపీలోని అధికారులు విధుల్లో ఒత్తిడికి గురి చేస్తున్నారని సమాచారం. అధికారుల ఒత్తిడి కారణంగానే తమ కుమారుడు మృతి చెందినట్లు కిరిటీ తల్లితండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిప్పు

కౌటాల, మే 17 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని గుండాయిపేట ఎత్తిపోతల పథకానికి గుర్తుతెలియని దుండగులు గురువారం రాత్రి నిప్పంటించారు. దీంతో లిఫ్ట్ ఇరిగేషన్ స్టార్టర్లు దగ్ధమయ్యాయి. కొన్ని రోజులుగా వార్దానది ఒడ్డున లిఫ్ట్ ఇరిగేషన్‌కు మరమ్మతులు కొనసాగుతున్నాయి. టాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్లు తరలించి రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్న తరుణంలో సామగ్రికి దుండగులు గురువారం రాత్రి నిప్పంటించారు. అటు వైపు వెళ్లిన గ్రామస్తులు మంటలను గమనించి అధికారులకు సమాచారం అందించారు. కాపర్‌వైరును దొంగలించేందుకు దండగులు ఇలా చేశారని అధికారులు, గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 17 : ప్రియుడితో కలిసి ఓ భార్య.. భర్తను చంపిన ఘటన ఆసిఫాబాద్ మండలంలోని రహపెల్లిలో శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ రాజేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. రహపెల్లికి చెందిన కళావతి, చునార్కర్ రవీందర్(38) భార్యాభర్తలు. అదే గ్రామానికి చెందిన అక్కపెల్లి రవీందర్‌తో కళావతి తరుచు ఫోన్‌లో మాట్లాడేది. దీంతో ఇంట్లో గొడవలు జరిగేవి. గతంలో పంచాయతీ కూడా జరిగింది. దీనిపై గురువారం కూడా గొడవ జరిగింది. ఇదే క్రమంలో భర్తను ప్రియుడితో కలిసి శుక్రవారం ఉదయం ఉరేసి చంపారు. రవీందర్ అన్నయ్య చునార్కర్ ఆనందరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్లీజ్ సార్ ఆదుకోండి

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి వేడుకోలు

మండల గ్రూప్‌లో సంపత్ చేసిన పోస్ట్

కోటపల్లి, మే 17 : 'కార్యకర్తలే పార్టీకి పునాది అన్నారు. కానీ కార్యకర్తకు ఆపద వస్తే మాత్రం ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ఇదేనా కార్యకర్తలని పట్టించుకునే విధానం' అంటూ మంచిర్యాల జిల్లా కోటపల్లికి చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొబ్బల సంపత్, ఆయన కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోటపల్లి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన దొబ్బల సంపత్ ఈ నెల 8న పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బైక్ ర్యాలీలో పాల్గొన్నాడు. స్వగ్రామానికి వస్తున్న క్రమంలో జరిగిన రోడ్డు (ఎడ్లబండిని ఢీకొట్టడంతో) ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో హైదరాబాద్‌లోని వెల్‌నెస్ హాస్పిటల్‌కు తరలించారు. ఇప్పటి వరకు రూ.5 లక్షలకు పైగా అప్పు తెచ్చి వైద్యానికి చెల్లించారు. ఈ నెల 15న డిశ్చార్జి అయి ఇంటికి వచ్చాడు. పరిస్థితి మళ్లీ ఆందోళనకరంగా మారగా ఈ నెల 16న మంచిర్యాలలోని ఆధిత్రి హాస్పిటల్‌లో చేరాడు. ప్రస్తుతం వైద్యం పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన సంపత్‌కు వైద్య ఖర్చులు భారంగా మారగా, సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. కాంగ్రెస్‌లో చురుకుగా వ్యవహరించిన పార్టీ యూత్ అధ్యక్షుడు సంపత్‌కు ఆపద రాగా, ప్రస్తుతం ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో తన వేదనను వాట్సాప్ ద్వారా మండల గ్రూప్‌లో పెట్టి వేడుకుంటున్నాడు. కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన సంపత్ ప్రస్తుతం దవాఖానకే పరిమితం కాగా, పార్టీ పట్టించుకోక పోవడం విమర్శలకు తావిస్తోంది. తాను పడుతున్న ఇబ్బందులను, తన ప్రస్తుత పరిస్థితిని కూడా స్థానిక ఎమ్మెల్యే వివేక్‌కు వాట్సాప్ ద్వారా సందేశం పంపిన సంపత్, ఆ సందేశాన్ని స్టేటస్‌గా పెట్టుకొని తన బాధాను వెల్లగక్కుతున్నాడు. కాగా, సహాయం చేయాల్సినవారు సెల్ నంబర్లకు 8328470731, 9346587232 కు ఫోన్ పే చేయాలని కోరుతున్నాడు.